క్లుప్తంగా

ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ


డ్వాక్రా ఆర్పీలకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతంపేట: డ్వాక్రా ఆర్పీలు ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారమయ్యేలా చూడాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. అక్కయ్యపాలెం షాదీఖానాలో సోమవారం డ్వాక్రా ఆర్పీలకు ట్యాబ్‌లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలతో నిత్యం మమేకమై ఆర్పీలు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించడంలో ముందుంటారని ప్రశంసించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, కార్పొరేటర్లు కంపా హనోక్, పెద్దిశెట్టి ఉషశ్రీ, ఆళ్ల లీలావతి, సీనియర్ నాయకులు శ్యామలాదీపిక, సురేష్ బాబు, కొయిలాడ వెంకటేష్ పాల్గొన్నారు.

42వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డులో సోమవారం దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పర్యటించారు. వార్డులోని చాకలిపేట, ఎర్రగెడ్డ, కోళ్ల ఫామ్ బ్రిడ్జి, దొండపర్తి పరిసర ప్రాంతాల్లోని సమస్యలను స్థానికులను అడిగి ఆయన తెలుసుకున్నారు. చాకలిగెడ్డ ప్రాంతంలో వర్షపు నీరు అధికంగా చేరుకోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు తెలియజేశారు. చాకలిగెడ్డలో గోడ నిర్మాణం వెంటనే చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పర్యటనలో జోన్-5 కమిషనర్ బి.రాము, వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, కూటమి నాయకులు ఆకిరెడ్డి జగదీష్, నాగమణి, రమణ, గురుగోవింద్ సింగ్, మౌళి, కాశీప్రసాద్, ఈఈ, ఏఈ, శానిటేషన్, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ బయట గుర్తు తెలియని వ్యక్తి మృతి


రైల్వేస్టేషన్ బయట ఆటోస్టాండ్ వద్ద వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ బయట గల ఆటో స్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా..... ఆదివారం మధ్యాహ్నం విశాఖ రైల్వేస్టేషన్ బయట గల ఆటోస్టాండ్ వద్ద సుమారు 35–40 ఏళ్ల వయసు గల మగ వ్యక్తి మరణించినట్లు ఫోర్త్ టౌన్ పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడిని పరిశీలించారు. ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని, ఈ వ్యక్తి గురించి వివరాలు తెలిసిన వారు ఫోర్త్ టౌన్ పోలీసులను స్వయంగా గానీ లేదా 94407 96012 నంబర్లలో తెలియజేయాలని కోరారు.

ఇద్దరి మధ్య కొట్లాట

- ఎటువంటి కేసు నమోదు కాలేదన్న కంచరపాలెం పోలీసులు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తుల మధ్య వాగ్వాదం జరిగి.. ఇద్దరూ కొట్టుకుని గాయపడిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రాజాంకు చెందిన సురేష్ బతుకుతెరువు కోసం తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం మధ్య 28 బస్ రూట్‌లో పండ్లు విక్రయిస్తుంటాడు. ఆదివారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో ఇంకా అక్కడే ఉండటంతో అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఇంత వరకు ఎందుకు అమ్ముతున్నావని ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సమాచారం అందుకున్న కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వారిద్దరినీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై వస్తున్న గ్యాంగ్ వార్, కొందరిని అదుపులోకి తీసుకోవడం అన్న ఆరోపణలు వాస్తవం కాదని పోలీసులు స్పష్టం చేశారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

ప్రకృతి వనరుల పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న సింహాచలం, విద్యార్థులు

మద్దిలపాలెం: ప్రకృతి వనరుల పరిరక్షణ అందరి బాధ్యతని ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ సింహాచలం అన్నారు. ఏయూ ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్‌లో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో నేతృత్వంలో సోమవారం మొక్కలు నాటారు. పక్షుల కోసం మట్టి పాత్రలో నీరు, ధాన్యపు కంకుల గుత్తులు ఏర్పాటు చేశారు. కోరమాండల్ ఫెర్టిలైజర్స్ వారి గుడ్డ సంచులు పంపిణీ చేశారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.


సీతంపేటలో రేషన్ డిపో వద్ద లబ్ధిదారులు

పప్పన్నం కరువాయే..!

- రేషన్ డిపోల్లో దొరకని కందిపప్పు
- ఏడాదిగా పంపిణీ చేయని కూటమి ప్రభుత్వం
- ప్రతి నెలా లబ్ధిదారుల ఎదురుచూపులు.. ఆపై తీవ్ర నిరాశ
- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కొనలేని పేద, మధ్యతరగతి ప్రజలు


అక్కయ్యపాలెంలో రేషన్ డిపో వద్ద లబ్ధిదారులు



సీతంపేట: కూటమి ప్రభుత్వంలో పేదోడికి పప్పన్నం కరువైంది. తాము అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని సంబరాలు చేసుకుంటున్న కూటమి నేతలు పేదలకు కిలో కంది పప్పు కూడా రేషన్ షాపుల ద్వారా అందించలేక పోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఇంటి వద్దకే రేషన్ రద్దు చేసిన సర్కారు నిర్ణయంతో రేషన్ షాపుల వద్ద జనం క్యూలు కట్టి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేషన్ డిపోల్లో అన్ని నిత్యావసర సరకులు తక్కువ ధరలకు దొరికేలా మాల్స్‌లా తీర్చిదిద్దుతామని ఎన్నికల ముందు ప్రచారం చేసిన కూటమి నాయకులు పేద, మధ్యతరగతి ప్రజలకు అవసరమైన కందిపప్పు సరఫరా చేయలేకపోతున్న పరిస్థితి. ఒకవైపు నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటాయి. కూరగాయల ధరలు అమాంతంగా పెరిగాయి. గత ప్రభుత్వంలో **బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ పిండి, రాగుల పిండి పంపిణీ చేసేవారని, కిలో రూ.67కే కందిపప్పు ఇచ్చేవారని జనం గుర్తుచేసుకుంటున్నారు. ప్రస్తుతం రేషన్ డిపోల ద్వారా కందిపప్పు ఎప్పుటి నుంచి ఇస్తారో తెలియని** అయోమయ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

ఏడాదిగా ఎదురుచూపులే..

ఉత్తర నియోజకవర్గంలో దాదాపు 72 వేల మంది తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. సుమారు రెండున్నర లక్షల జనాభా ప్రతి నెలా రేషన్ డిపోలో ఇచ్చే కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా కార్డుదారులు కందిపప్పు వచ్చిందా.. ఎప్పుడొస్తుంది.. అసలు ఇస్తారా లేదా అని ప్రశ్నలు అడుగుతుంటే ఏమి సమాధానం చెప్పాలో తెలియక రేషన్ డీలర్లు తెల్ల మొహం వేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.140 నుంచి రూ.150 వరకు ధర పలుకుతోంది. అంత ధర పెట్టి కొనలేని పేద, మధ్యతరగతి ప్రజలు రేషన్ షాపులో ఎప్పుడు ఇస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నెల కాకపోతే వచ్చే నెల ఇస్తారని ఆశపడుతూ వస్తున్న మహిళలకు ఏడాదిగా ఎదురుచూపులే మిగిలాయి.

కందిపప్పు లేదంటున్నారు..



రేషన్ డిపోలో బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు అడిగితే రాలేదని డీలర్ చెబుతున్నారు. బయట మార్కెట్‌లో కిలో రూ.150 వరకు పలుకుతోంది. అంత ధర పెట్టి కొనలేకపోతున్నాం. గతంలో కిలో రూ.67కు కంది పప్పు ఇచ్చేవారు. ఏడాది కాలంగా కందిపప్పు రేషన్‌లో ఇవ్వడం లేదు. పాలకులు ఆలోచించి పేదలకు కందిపప్పు సరఫరా చేయాలి.

– పి.గౌరమ్మ, సీతంపేట

అడిగితే కసురుతున్నారు..



ఎన్నికల ముందు అన్ని సరకులు రేషన్ షాపుల్లో దొరికేలా చూస్తామన్నారు. ఇపుడేమో కంది పప్పు రాలేదంటున్నారు. ప్రతి నెలా కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నాం. డీలర్ మాత్రం రాలేదు, వస్తే ఇవ్వమా అని కసురుకుంటున్నారు. గతంలో ఇంటింటికీ రేషన్ బండి ద్వారా బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ, రాగిపిండి ఇచ్చేవారు. ఏడాదిగా బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు.

– పి.ఆదిలక్ష్మి, సీతంపేట

బియ్యానికి బదులు డబ్బులు



కందిపప్పు మాట దేవుడెరుగు. కొన్ని రేషన్ షాపుల్లో బియ్యానికి బదులుగా బలవంతంగా డబ్బులు ఇస్తున్నారు. బియ్యం కావాలని అడిగినా ఇవ్వకుండా డబ్బులు ఇస్తున్నారు. రేషన్ బియ్యం తినేవారికి చుక్కలు చూపిస్తున్నారు. డిపోలో సర్వర్ స్లోగా ఉంది. మిషన్ పనిచేయడం లేదని చెప్పి వేలిముద్ర వేయించి డబ్బులు ఇచ్చి పంపిం చేస్తున్నారు. పేదవాడి బియ్యాన్ని అక్రమంగా తరలించడానికే మొగ్గుచూపుతున్నారు.

– షేక్ బాషా, నగర అధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్

లలితా పీఠంలో గణపతి పూజలు


విజయ గణపతికి పూజలు చేస్తున్న అర్చకుడు

సీతంపేట: సంకట హర చతుర్థి సందర్భంగా సోమవారం లలితానగర్ శ్రీలలితా పీఠంలో విజయ గణపతికి పంచామృతాభిషేకం, అర్చన, అలంకరణ మొదలగు ప్రత్యేక పూజలు, గణపతి హోమం నిర్వహించారు. మనుష్యులను కష్టాల నుంచి గట్టెక్కించే సంకట హర చతుర్థి వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేస్ తెలిపారు. పీఠం అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ దూప దీప నైవేద్యం, గణేశ స్తోత్రం, వ్రత కథ చదివారు. అనంతరం పీఠం దర్బారు హాల్ శాస్త్రోక్తంగా గణపతి హోమం చేశారు. బహుళ పంచమి సందర్భంగా మంగళవారం శాకంబరి అలంకరణలో లలిత అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని కృష్ణసేస్ తెలిపారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం


అర్జీలు పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారుల నుంచి మూడు వినతులను జోనల్ కమిషనర్ బి.రాము స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి మూడు వినతులు అందినట్లు తెలిపారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్న రెడ్డి, డీఈ భరణికుమార్, ఏపీడీవో కృపానందం, పాల్గొన్నారు.

ఏరోస్పేస్ శిక్షణార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం


సర్టిఫికెట్లు పొందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులు

మురళీనగర్: ఏరోస్పేస్ రంగంలో ఏరోస్పేస్ తయారీపై పారిశ్రామిక శిక్షణ పూర్తి చేసిన పాలిటెక్నిక్ విద్యార్థులకు సోమవారం ధ్రువపత్రాలను అందించారు. బోయింగ్ ఏరోస్పేస్ సంస్థ నిధులతో లెర్న్ అండ్ ఎర్న్ సంస్థ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. ఈ మేరకు శ్రీకాకుళం, కంచరపాలెం, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల నుంచి 50 మంది శిక్షణ తీసుకుని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మేరకు విద్యార్థులకు టెక్నికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ సర్టిఫికెట్లు అందించారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, జీఈ ఏరోస్పేస్, ఎల్ అండ్ టీ డిఫెన్స్, మారుతి సుజుకి, మేధా సర్వో, రాయల్ ఎన్‌ఫీల్డ్, టాటా హిటాచీ వంటి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన సందర్భంగా విద్యార్థులను డాక్టర్ రామకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ఢిల్లీ చీఫ్ జనరల్ మేనేజర్ అనురాగ్ శర్మ, మేనేజర్ శేఖర్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ డీజీఎం ప్రసాద రెడ్డి, ట్రైనింగ్ హెడ్ డాక్టర్ మురళీకృష్ణ, పెందుర్తి పాలిటెక్నిక్ ఫ్యాకల్టీ, ఎంఎస్ఎంఈ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దృష్టికి పోర్టు కార్మికుల సమస్యలు


కేంద్ర మంత్రి శర్బానంద్ సోనోవాల్‌కు సమస్యలు వివరిస్తున్న శ్రీనుబాబు

ఏయూ క్యాంపస్ : నగరానికి విచ్చేసిన కేంద్ర మంత్రి శర్బానంద్ సోనోవాల్ దృష్టికి పోర్ట్‌లో పర్మినెంట్ కాకుండా ఉన్న మేస్త్రీలు, కార్మికుల సమస్యలను విశాఖ పోర్ట్ ట్రస్ట్ సలహా మండలి కమిటీ పూర్వ సభ్యులు గంట్ల శ్రీనుబాబు తీసుకెళ్లారు. బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో మంత్రిని కలిసి పోర్ట్ కార్మికుల సమస్యలను వివరించారు. సింహాచలంలో కొలువైన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి చందన ప్రసాదాన్ని అందించి, సత్కరించారు. సింహాచలం క్షేత్ర విశేషాలను మంత్రికి తెలియజేశారు.

డ్రగ్స్ నిర్మూలనపై సెమినార్లు


పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిసిన హ్యూమన్ రైట్స్ సెల్ ప్రతినిధులు

సీతంపేట: విశాఖ జిల్లాలో డ్రగ్స్ వైపు యువత వెళ్లకుండా వారి ఆలోచనా విధానం మార్చేందుకు యూనివర్సిటీలు, కళాశాలల్లో సెమినార్లు నిర్వహించనున్నట్టు హ్యూమన్ రైట్స్ సెల్ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, కె.మంగయ్యనాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిసి సహకారం కోరారు. ఇటువంటి సామాజిక కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సీపీ తెలిపారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు, విశాఖ జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి, కార్య నిర్వాహక అధ్యక్షుడు జి.ఎస్.ఎన్.రాజు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.వి.విశ్వనాథం, జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబు పాల్గొన్నారు.

'కొలిమి రాజెయ్యాల్సిందే' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వల్లూరు శివప్రసాద్, ఆచార్య చలం

సీతంపేట: అసమానతలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని వివక్షపై పోరాటంగా చూడాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ పూర్వ సభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో పతివాడ నాస్తిక్ రచించిన 'కొలిమి రాజెయ్యాల్సిందే' అనే పుస్తకాన్ని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చలం మాట్లాడుతూ సమాజంలో అసమానతలు పెరిగితేనే తిరుగుబాటు వస్తుందన్నారు. సమాజంలో జరుగుతున్న ఘర్షణ, నైరాశ్యం, వివక్షపై కవులు, రచయితలు లోతుగా విశ్లేషించి స్పందించాలని కోరారు. పతివాడ నాస్తిక్ రచించిన కవిత్వం శ్రీశ్రీని గుర్తిచేసిందన్నారు. శివప్రసాద్ మాట్లాడుతూ విమర్శనాత్మకమైన కవితలతో పుస్తకం అక్షరాల కొలిమిలా ఉందన్నారు. కవి రెడ్డి రామకృష్ణ పుస్తక సమీక్ష చేశారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సభలో స్రవంతి ప్రధాన కార్యదర్శి చీకటి దివాకర్, అరసం విశాఖ అధ్యక్షుడు అడపా రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎస్.హనుమంతరావు, బసు పోతన తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం


శెట్టి అబ్రహంను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కంచరపాలెం సీఐ రవికుమార్, సిబ్బంది

మర్రిపాలెం: ఈ నెల 10న సెల్‌ఫోన్ చూస్తుంటే తండ్రి మందలించాడని మనస్తాపం చెంది ఇంటి ఉంచి వెళ్లిపోయిన శెట్టి అబ్రహం అనే బాలుడు ఆచూకీ లభ్యమైందని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే అంతటా గాలించగా.. సదరు బాలుడు కాకినాడలోని ఉన్నట్టు గుర్తించామని హెడ్ కానిస్టేబుల్ సాధన చెప్పారు. అబ్రహంను పట్టుకుని పోలీసులు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారన్నారు. సీఐ రవికుమార్ సమక్షంలో సోమవారం రాత్రి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత


తల్లి అరుణకు కుమారుడిని అప్పగిస్తున్న సీఐ రవికుమార్, సిబ్బంది

మర్రిపాలెం: కొద్ది రోజుల కిందట తప్పిపోయిన ఓ బాలుడిని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలిలా.. అన్నవరానికి చెందిన నాలుగేళ్ల రమేష్ అనే బాలుడు తల్లి అరుణతో కలిసి రెడ్డి కంచరపాలెంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తర్వాత కుమారుడు కనిపించకపోవడంతో బాలుడి తల్లి 112 ద్వారా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రవికుమార్ వెంటనే స్పందించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. తీవ్రంగా గాలించిన పోలీసులు ఊర్వశి కూడలి వద్ద బాలుడు సంచరించడాన్ని గుర్తించి, తీసుకువచ్చి తల్లికి సమాచారం అందించారు. సోమవారం సీఐ రవికుమార్ సమక్షంలో బాలుడు రమేష్‌ను తల్లికి సిబ్బంది అప్పగించారు. సకాలంలో స్పందించి కుమారుడిని తమకు అప్పజెప్పినందుకు ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలి



ఆటో యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్

ఆరిలోవ: ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలని ట్రాఫిక్ సీఐ కె.వి.ఎస్.ప్రసాద్ సూచించారు. జిల్లా ఆటో కార్మిక సంఘం (సీఐటీయూ) మద్దిలపాలెం జోన్ ఎనిమిదో మహాసభలు సోమవారం తోటగరువు ఎర్నిదుర్గమాంబ ఆలయం ఆవరణలోని కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. క్రమశిక్షణ, పద్ధతులు పాటించే ఆటో డ్రైవర్లకు పోలీసుల సహాయం ఉంటుందన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు గుదిబండలాంటి రవాణా చట్ట సవరణకు కేంద్ర ప్రభుత్వం పూనుకొందన్నారు. దీనిపై ఆటో కార్మికులు పదేళ్లుగా పోరాడుతున్నారన్నారు. కేంద్రం అమలు చేస్తున్న చట్టాలు చాపకింద నీరులా ఆటో డ్రైవర్లను వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, డీజిల్, సీఎన్‌జీపై సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆటో కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, పి.రాజ్‌కుమార్, సత్యం, శంకరరావు, అప్పలరాజు, గోపి, గురుమూర్తి పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం


గైస్‌లో రక్తదానం చేస్తున్న ప్రిన్సిపాల్ రమణ, విద్యార్థులు

మురళీనగర్: రక్తదానం ద్వారా మరో ముగ్గురికి ప్రాణ దానం చేయవచ్చని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అన్నారు. గైస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, లయన్స్ క్లబ్ పాస్ట్ జిల్లా గవర్నర్ వి.ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. లయన్స్ క్లబ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.వి.రమణ మాట్లాడుతూ సరైన సమయంలో రక్తం అందక అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారికి మనం అందించే రక్తమే ప్రాణం నిలబెడుతుందన్నారు. ఇటువంటి మహత్తరమైన కార్యక్రమంలో విద్యార్థులు ముందుకొచ్చి తనతో పాటు రక్తదానం చేయడంపై ఆయన అభినందించారు. పలువురు రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి ప్రశంసించారు. కళాశాల ద్వారా సేకరించిన 39 యూనిట్ల రక్తాన్ని లయన్స్ క్లబ్‌కు అందించారు.

ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు మరింత విస్తృతం


కో ఆర్డినేటర్ సింహాచలంను సత్కరిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ అధికారుల బృందం

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో జాతీయ సేవా పథకం కార్యక్రమాలు విస్తృతం చేయాలని ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డి.సింహాచలం సూచించారు. ఏయూలోని జాతీయ సేవా పథకం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో గల గ్రామీణ, పట్టణ, గిరిజన ప్రాంతాల్లో నిర్వహించే సేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేయాలని సూచించారు. మై భారత్ పోర్టల్‌లో వలంటీర్లంతా పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో నూతన వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం జోనల్ అధికారి డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, వివిధ జిల్లాల నోడల్ అధికారులు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్, జి.తాతయ్య నాయుడు, గౌరీ శంకర్ తదితరులు తమ పరిధిలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డి.సింహాచలంను ఘనంగా సత్కరించారు.

అబ్బురపరిచిన పద్యనాటక ఘట్టాలు

మద్దిలపాలెం: పౌరాణిక, పద్యనాటక ఘట్టాలు అబ్బురపరిచాయి. విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్యనాటక కళాకారుడు, నంది పురస్కార గ్రహీత వంకాయల మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం కళాభారతి ఆడిటోరియంలో కోలాహలంగా నిర్వహించారు. కిక్ బాక్సింగ్ యువ క్రీడాకారిణి వంకాయల ఉషారాణి పేరిట ఆమె తండ్రి మారుతీ ప్రసాద్ ఈ సంస్థను నెలకొల్పి సాంస్కృతిక సేవ చేస్తున్నారు. శ్రీకాకుళానికి చెందిన కళాకారులు రామాంజనేయ యుద్ధాన్ని కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. విజయనగరానికి చెందిన హుస్సేన్, సత్యశ్రీ జంట సత్యహరిశ్చంద్రుడు నాటకంలోని కాటిసీను రసవత్తరంగా ప్రదర్శించారు. విశాఖకు చెందిన ఎం.ఎస్.నాయుడు, మెరక సత్యనారాయణ గయోపాఖ్యానం ప్రదర్శించారు. హరిశ్చంద్రుడి అమ్మకం ఘట్టం ప్రేక్షకుల నీరాజనాలందుకుంది. విజేతలకు వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం మజ్జి శ్రీను మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కళాకారులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కళాకారుల పట్ల వివక్ష చూపుతోందన్నారు. జీవన భృతి పెంచకుండా తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవన భృతి రూ.4 వేలు అందించామని, నేటికీ అదే మొత్తం కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు.